క్లుప్తంగా

డ్రైవర్లపై విద్యార్థి సంఘం దుష్ప్రచారం తగదు



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న డ్రైవర్లు

జనగామ రూరల్/దేవరుప్పుల: పదేళ్ల పైచిలుకు పాఠశాల బస్సులు నడుపుతూ పిల్లల పరిరక్షణకు పాటుపడుతున్న తమపై విద్యార్థి సంఘం దుష్ప్రచారం చేయడం తగదని బాలయేసు హైస్కూల్ బస్సు డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. బాలయేసు పాఠశాలపై కక్షసాధింపు చర్యలో భాగంగా తమ డ్రైవర్ వృత్తిని కించపరుస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం తదితరులపై చర్య తీసుకోవాలని కలెక్టరేట్‌లో ఏఓ మన్సూర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బస్సు డ్రైవర్లు జోగు అనిల్, మల్లేష్, శ్రీధర్, కృష్ణయ్య, సోమిరెడ్డి, మహేష్, కిరణ్ తదితరులు మాట్లాడుతూ జీవనోపాధి కోసం పనిచేస్తున్న డ్రైవర్లమైన తమపై లేనిపోని ఆరోపణలు చేస్తూ అనుభవం లేదని, లైసెన్సులు లేవని ఫిర్యాదు చేయడంతో తల్లిదండ్రులు భయాందోళనతో బస్సులు ఎక్కించని దుస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి సంఘం వాస్తవిక దిశలో పనిచేయాలని కోరారు.

‘జర్నలిస్టులకు ప్రాధాన్యం ఇవ్వాలి’

జనగామ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాల్లో అర్హులైన జర్నలిస్టులకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్‌జేయూ) జిల్లా అధ్యక్షుడు ఉప్పలంచి నరేందర్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ రిజ్వాన్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 200 మంది జర్నలిస్టులకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో స్థలం ఉన్న వారికి ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సాయం అందించడంతో పాటు స్థలం లేని వారికి స్థలం కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అలాగే కలెక్టరేట్‌లో ఏదైనా ఖాళీగా ఉన్న గదిని ప్రెస్‌క్లబ్‌కు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మగాని శ్రీకాంత్ గౌడ్, కోశాధికారి కొన్నె ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పాలకుర్తి టౌన్: ఆటో బోల్తా పడి ఏడుగురికి గాయాలైన సంఘటన పాలకుర్తి మండలం చెన్నూరు మూలమలుపు వద్ద జరిగింది. సోమవారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో బంధువు మృతి చెందగా అంత్యక్రియల్లో పాల్గొని ఆటోలో మండలంలోని బమ్మెరకు వస్తుండగా చెన్నూరు మలుపు వద్ద ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న బమ్మెర గ్రామానికి చెందిన వరిపక్కుల అనిల్, రజిత, శ్రీను, ఎల్లయ్య, ఐలయ్య, రాములమ్మ, ఎల్లమ్మలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను పాలకుర్తిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం హనుమకొండకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విగ్రహ ప్రతిష్ఠ



చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామ సమీపంలోని ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలోని పుట్ట వద్ద వసంత పంచమిని పురస్కరించుకుని సోమవారం నాగదేవత విగ్రహాన్ని గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి వెంకటేశ్వర్లు దంపతులు వేద మంత్రాల నడుమ ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో పూజారి రాజమోహన్, గట్టు రవి, ఐలయ్య, వెంకన్న, గణేష్, కుమార్, చంద్రమౌళి పాల్గొన్నారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- చెత్త సేకరణ మరిచిన సిబ్బంది
- అమలుకు నోచుకోని కంపోస్టు ఎరువుల తయారీ



పాలకుర్తిలో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్



పాలకుర్తిలో డంపింగ్ యార్డ్‌లో చెత్త కాల్చివేత

పాలకుర్తి టౌన్: చెత్తను కంపోస్టు ఎరువుగా మార్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం గ్రామాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించి ఎరువులు తయారు చేసి గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేద్దామనేది ప్రభుత్వ సంకల్పం. కానీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. పంచాయతీల్లో పాలకవర్గాలు ఉన్నంత వరకు గ్రామాల్లో చెత్త సేకరణ జరిగింది. ప్రస్తుతం పాలకవర్గాలు లేకపోవడంతో కనీసం చెత్త సేకరించే నాథుడే కరువయ్యారని పాలకుర్తి మండలంలోని గ్రామాల ప్రజలు అంటున్నారు.

పర్యవేక్షణ లేక..

ప్రతీ గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున డంపింగ్ యార్డు, సెగ్రిగేషన్ షెడ్‌లను ఉపాధి హామీ నిధులు రూ. 2లక్ష 53 వేలతో నిర్మించారు. ప్రారంభంలో గ్రామ పంచాయతీ ట్రాక్టర్లు, మల్టీ పర్పస్ వర్కర్ల ద్వారా తడి, పొడిచెత్తను సేకరించి సేంద్రియ ఎరువు తయారు చేశారు. చెత్త సేకరణకు ఇంటికి రెండు చొప్పున ప్లాస్టిక డబ్బాలు కూడా పంపిణీ చేశారు. సిబ్బంది వారంలో రెండు మూడు రోజులు గ్రామాల్లో వీధులన్నీ తిరిగి చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించారు. ఆ తర్వాత ప్రభుత్వం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చెత్త సేకరణ చేస్తున్నారా.. కంపోస్టు ఎరువు తయారు అవుతోందా అని తెలుసుకునేవారు లేకుండా పోయారు. అసలు పంచాయతీ సిబ్బంది కూడా చెత్త సేకరణ చేయడమే మరిచారు. అక్కడక్కడ సేకరించిన చెత్తను కూడా డంపింగ్ యార్డులకు తరలించి మంటపెట్టి కాల్చివేస్తున్నారు. దీంతో కంపోస్టు ఎరువు తయారీ చేయాలనే లక్ష్యం అటకెక్కినట్లు అయింది. కొన్ని గ్రామాల్లో చెత్తను ఊరిబయట, డంపింగ్ యార్డ్స్‌లో వేసి కాల్చివేస్తున్నారు. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి గ్రామాల్లో చెత్తను డంపింగ్ యార్డులకు తరలించి కంపోస్టు ఎరువు తయారు చేసేలా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సిబ్బందిని ఆదేశిస్తాం..



గ్రామాల్లో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్‌లను పర్యవేక్షిస్తాం. కొన్ని గ్రామాల్లో చెత్తతో ఎరువులను తయారు చేశారు. వాటిని స్థానిక నర్సరీలోనే వాడారు. సిబ్బందికి సర్వేలు, ఇతర పని భారం ఎక్కువగా ఉంది. ప్రస్తుతం గ్రామాల్లో తడి, పొడిచెత్తపై ప్రజలకు అవగాహన కల్పించి, చెత్త సేకరణ చేపట్టాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం.

-ఆవుల రాములు, ఎంపీడీఓ, పాలకుర్తి

సామూహిక అక్షరాభ్యాసం



జనగామ రూరల్: అక్షరాభ్యాసంలో చిన్నారులతో తల్లిదండ్రులు



తరిగొప్పులలో..



దేవరుప్పుల: సాయిప్రశాంతి విద్యానికేతన్ పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో..

తరిగొప్పుల/జనగామ రూరల్/దేవరుప్పుల: వసంత పంచమి పురస్కరించుకుని ఏకోపాధ్యాయ ఆచార్య ఆధ్వర్యంలో తరిగొప్పుల మండలంలోని పోతారం గ్రామంలో సోమవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంచ్ సడక్ అనిల్ సమక్షంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే జనగామ బీరప్పగడ్డలోని సరస్వతి శిశుమందిర్ విద్యాలయంలో వేద బ్రాహ్మణుల చేత చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. హెచ్ఎం బాలనర్సయ్య, బుస్స సిద్దేశ్వర్, రజని తదితరులు పాల్గొన్నారు. కాగా, దేవరుప్పుల మండల కేంద్రంలోని వాసవీమాత ఆలయంలో సాయి ప్రశాంతి విద్యానికేతన్ పాఠశాల యాజమాన్యం చండీపరమేశ్వరి పీఠం సిద్ధాంతి అవసరాల ప్రసాద్‌శర్మతో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కరస్పాండెంట్ తోటకూరి కృష్ణ, ప్రిన్సిపాల్ తోటకూరి స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

నర్మెట: మండలకేంద్రంలోని కాకతీయుల కాలం నాటి అతిపురాతన శివాలయం పూర్తి శిథిలావస్థకు చేరుకుంది. కాగా, గంగం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలోని ఆలయ కమిటీ భక్తులతో కలసి రూ. 75 లక్షల అంచనా వ్యయంతో పునర్నిర్మాణ పనులు చేపట్టారు. ఈక్రమంలో రెడ్డి సహకార పొదుపు సంఘం (తూర్పు బజారు కాపులు) రూ. 80,116లు, చిర్ర అనిత మహిపాల్ రెడ్డి దంపతులు రూ. 10,116 సోమవారం ఆలయ అభివృద్ధి కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో నిమ్మ హనుమారెడ్డి, వెంకట్ రెడ్డి, ఇమ్మడి గాల్ రెడ్డి, పాతూరి సాయిరెడ్డి, బండి వీరారెడ్డి, లింగారెడ్డి, రాజిరెడ్డి, మోహన్‌రెడ్డి, పోగుల ఎల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాల కులస్తుల చేతిలో సీఎం కీలుబొమ్మ

- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ఎస్సీల వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి కాలయాపన చేస్తూ మాల కులస్తుల చేతిలో కీలుబొమ్మగా పనిచేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిపై, ఎమ్మెల్యే కడియం వైఖరిపై మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ముందు మాదిగలను పొగుడుతూ వెనుకాల మాలలను ఎగేస్తున్నాడని, కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నాడని ఆరోపించారు. సీఎంకు ఎస్సీల ఏ.బీ, సీ, డీల వర్గీకరణపై ఆర్డినెన్స్ జారీ చేయాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్‌తో గత టీడీపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల్లో వివిధ శాఖలలో మంత్రిగా పనిచేసి ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న కడియం శ్రీహరి ఎస్సీల వర్గీకరణపై తన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఎస్సీల వర్గీకరణకు అసెంబ్లీలో బిల్లు పెట్టాలన్నారు. మాజీ జెడ్పీటీసీ మారపాక రవి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్, నాయకులు కనకం గణేష్, తాటికొండ సురేష్ తదిరులు పాల్గొన్నారు.

తెలంగాణపై కేంద్రం చిన్నచూపు



కొడకండ్ల: నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

- కాంగ్రెస్ నాయకులు



రఘునాథపల్లి: ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



పాలకుర్తి టౌన్: రాజీవ్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

రఘునాథపల్లి/కొడకండ్ల/పాలకుర్తి టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొండి చెయ్యి ఇచ్చి చిన్నచూపు చూపి బీజేపీ వివక్షతను చాటుకుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ సోమవారం పలు మండల కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ నుంచి జీఎస్టీ రూపంలో రూ. లక్ష కోట్లు వసూలు చేసి కనీసం రూ. 40 వేల కోట్లు ఇవ్వక పోవడం దుర్మార్గమని ఆరోపించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, నాయకులు రాపాక సత్యనారాయణ, ధరావత్ సురేష్‌నాయక్, కోళ్ల రవిగౌడ్, పోకల శివకుమార్గిరగాని కుమారస్వామి, మార్కెట్ చైర్మన్ లావుడియ మంజుల, మాజీ ఎంపీపీలు గద్దం యాకసోమయ్య, జంగిటి విద్యానాథ్ తదితరులు పాల్గొన్నారు.

‘జబ్బకు డప్పేసుకుని కదలి రావాలి’



లింగాలఘణపురం: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

లింగాలఘణపురం: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే వేల గొతులు–లక్షల డప్పుల మహా ప్రదర్శనలకు మాదిగలంతా జబ్బకు డప్పేసుకుని కదలి రావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో వేల గొంతులు–లక్షల డప్పుల కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను మండల అధ్యక్షుడు గండి సురేశ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు సాగే ప్రదర్శనలో ప్రతిఒక్కరూ డప్పుతో రావాలని కోరారు. నర్సింగ రవి, ఎస్.ఉపేందర్, సీహెచ్.కనకరాజు, అనిల్, బాబు, శ్రీహరి, చంద్రమౌళి, ప్రవీణ్, కరుణాకర్, యాకన్న, మల్లేశం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్: ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న వేల గొంతులు–లక్షల డప్పుల మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రడపాక అదాం పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సంఘం నాయకులు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఇల్లందుల రాంబాబు, గాదెపాక మధు, మాజీ సర్పంచ్ తాటికాయల బాబు, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, తాటికాయల యాకయ్య చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

దేవరుప్పుల: ఎస్సీ సామాజిక వర్గ సాంస్కృతికత అద్దం పట్టేందుకు తలపెట్టిన భారీ ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పడమటింటి నర్సింహ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని జనగామ–సూర్యాపేట రహదారిలో ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో తలపెట్టిన వేల గొంతులు–లక్షల డప్పులు సాంస్కృతిక ప్రదర్శన ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొంగరి రాములు, జోగు సుదర్శన్, మధుసూదన్, భాషిపాక మధు, దొపాటి నర్సయ్య, వంగాల శ్రీనివాస్ దొపాటి మల్లయ్య, ముత్తయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



పాలకుర్తి టౌన్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి

పాలకుర్తి టౌన్/కొడకండ్ల/దేవరుప్పుల: నియోజకవర్గ ప్రజల ఆదరణ, అభిమానాన్ని ఎప్పటికీ మర్చిపోనని, అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తన ధ్యేయమని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, కొడకండ్ల, దేవరుప్పుల మండలంలో కార్యకర్తలు, అభిమానుల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జ్ హనుమండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కేట్ కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే సీతారాంపురం అనాథ వృద్ధాశ్రమంలో ఎమ్మెల్యే పండ్లు, స్వీట్లు, దుస్తులు పంపిణీ చేశారు.

సంక్షిప్త సమాచారం

నియామకం



చిల్పూరు: కురుమ సంఘం మండల అధ్యక్షుడిగా మల్కాపూర్ గ్రామానికి చెందిన కట్ట బీరప్పను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు కంచ రాములు తెలిపారు. ఈ మేరకు సోమవారం డివిజన్ కేంద్రంలో నిర్వహించిన కురుమ సంఘం సమావేశంలో బీరప్పకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీరప్ప మాట్లాడుతూ మండలంలో కురుమల ఆర్థిక సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తానన్నారు. అలాగే మండల కమిటీ గౌరవ అధ్యక్షుడిగా మేకల మల్లేశం, ఉపాధ్యక్షుడిగా కంచర్ల రామరాజు, ప్రధానకార్యదర్శిగా దోకి శ్రీనివాస్, కోశాధికారిగా బోడపట్ల అనీల్, సహాయ కార్యదర్శిగా పొన్న రాజయ్య ఎన్నికయ్యారు.

సత్కారం

పాలకుర్తి/దేవరుప్పుల: పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన పోతన సాహిత్య కళావేదిక అధ్యక్షుడు, కవి మాన్యపు భుజేందర్, దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన సామాజిక కవి, రచయిత అంకాల సోమయ్యను డాక్టర్ రామచంద్ర మూర్తి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఆదివారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో ప్రముఖ కవి రామచంద్రమూర్తి ఎనిమిది దశాబ్దాలు పురస్కరించుకుని రామచంద్రామృతం సావనీర్ ఆవిష్కరణ సందర్భంగా కవులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ పూర్వాధ్యక్షుడు డాక్టర్ నందిని సిదారెడ్డి, కెయూసీ పరిధి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ బన్న ఐలయ్య, బాలాచారీ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని మారేపల్లిగూడేనికి చెందిన గుర్రపు పాపయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు రూ. 5 వేల ఆర్థిక సాయంగా పంపగా పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, చిల్పూరు ఆలయ ధర్మకర్త రత్నాకర్‌రెడ్డిలు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ధార రాజు, ఇసురం యేసు, అశోక్‌పాల్, రజనీకుమార్, రాజ్‌కుమార్, అంజన్న, రాజు తదితరులు ఉన్నారు.

రేపు నిడిగొండలో కిసాన్‌మేళా

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండలో ఈ నెల 5వ తేదీన కేంద్రీయ పత్తి పరిశోధన సంస్థ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కిసాన్‌మేళా, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి కాకి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం తెలిపారు. కిసాన్‌మేళాకు ముఖ్య అతిథులుగా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా, వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ యాకాద్రి, సహాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఉమ్మారెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. నూతన వ్యవసాయ పరిజ్ఞానంపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించనున్న నేపథ్యంలో సదస్సుకు రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

పరామర్శ



చిల్పూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పల్లగుట్ట గ్రామానికి చెందిన జి.కట్టయ్యను సోమవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు పరామర్శించారు. రోడ్డు ప్రమాదానికి గురైన కట్టయ్య హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రూ.15 లక్షల వరకు ఖర్చు చేసినా నయం కాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆర్థిక పరిస్థితిని బీఆర్ఎస్ నాయకులకు తెలుపగా వారు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి నీలిమా ఆస్పత్రిలో ఉచిత వైద్య సేవలు అందేలా చేశారు. ఉడుత అశోక్, జనగాం యాదగిరి, రాకేష్‌రెడ్డి, ఎడ్ల రాజేష్ ఉన్నారు.

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం



బడ్జెట్ ప్రతులతో నిరసన తెలుపుతున్న నాయకులు

జనగామ రూరల్: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు లెక్కల్లో చూపడమే తప్ప ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందునాయక్ పేర్కొన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్క్ సెంటర్‌లో సంఘం నాయకులు బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత బడ్జెట్ కంటే ఈ బడ్జెట్‌లో రూ. 10వేల కోట్లు వ్యవసాయ రంగానికి, ఎరువుల సబ్సిడీకి రూ.11 వేల కోట్లు తగ్గించారన్నారు. గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి అజ్మీరాసురేష్‌నాయక్, కల్యాణ లింగం, ధరావత్ మహేందర్, రాములు, మల్లయ్య పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలానికి బోర్డు ఏర్పాటు



శ్మశాన వాటిక వద్ద బోర్డు ఏర్పాటు చేసిన దళితులు

చిల్పూరు: రాజవరంలో దళితులకు చెందిన శ్మశాన వాటిక ఆక్రమణకు గురికాకుండా ఆదివారం సోమవారం బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘం బాధ్యులు మాట్లాడుతూ తాత ముత్తాతల కాలంలో 81,82 సర్వేనంబర్‌లోని నాలుగు ఎకరాల్లో శ్మశాన వాటిక ఏర్పాటు చేయగా అప్పటి నుంచి నేటి వరకు దళితులు ఎవరు మృతి చెందినా ఆ స్థలంలో దహన సంస్కారాలు చేస్తున్నామన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన పాగాల సుధాకర్ రెడ్డి, ప్రమోద్‌రెడ్డి శ్మశాన వాటికకు ఇచ్చిన భూమి తమపేరనే ఉందని, కావున తమకే చెందుతుందని ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండడంతో బోర్డును ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. కొంరయ్య, మహిపాల్, మల్లయ్య, ప్రమోద్, శ్రీనులు ఉన్నారు.